శుక్రవారం
19-7-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 398, పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

# రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం

- కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమే
- తొలివిడతగా రూ.1 లక్షలోపు రైతు రుణాల మాఫీ
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





ముందడుగు తెలంగాణ: తెలంగాణ రైతాంగానికి రుణమాఫీపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని, కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని మరోసారి రుజువైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తొలివిడతగా రూ.1 లక్ష లోపు రైతు రుణాల మాఫీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లోని రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయం నుంచి ఆయన మాట్లాడారు. మొత్తం 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్ల నగదు జమ చేసినట్లు తెలిపారు. ఆర్థికశాఖ ఇప్పటికే బ్యాంకులకు నగదు జమ చేసింది. గతంలో రుణమాఫీ అమలు చేస్తామని ఐదేళ్లు కాలయాపన చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ పథకం సరిగా అమలు చేయలేదు. రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు రుణమాఫీ చేస్తున్నాం.

ఇంతకుముందు చెప్పినట్లుగానే ఈ నెలాఖరు నాటికి రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తాం. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుంది. కుటుంబాన్ని నిర్ధరించేందుకే రేషన్ కార్డు ప్రామాణికం. రుణాలు తీసుకున్న మిగతా 2లో

## పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్ రైలు

- పక్కకు ఒరిగిపోయిన పట్టాలు
- నలుగురు మృతి, 20మందికి గాయాలు



ముందడుగు ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్ గోండా జిల్లాలో మరో రైలు ప్రమాదం జరిగింది. చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. గురువారం మధ్యాహ్నం 2.35 గంటల ప్రాంతంలో ఈ ఘటన మిగతా 2లో

## డిజిపి గారు.. పోలీసులది ఇదేం భాష

- పోలీసులకు ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ముందడుగు తెలంగాణ: తెలంగాణలో కొంతమంది పోలీస్ సిబ్బంది వినరాని భాషలో సాధారణ పౌరుడిని దుర్భాషలాడటంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర డిజిపిని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు గండి మైసమ్మ మిగతా 2లో



రీల్స్ చేస్తూ లోయలో పడ్డ
### రీల్ స్టార్
మిగతా 2లో



### రైతులను కూడా వదలని సైబర్ కేటుగాళ్లు
మిగతా 4లో



### చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం నేరం కాదు
మిగతా 4లో



### అవమానాల నుంచి యునెస్కో గుర్తింపు
మిగతా 5లో

ముందడుగు
శుక్రవారం, 19-7-2024, హైదరాబాద్

# రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు 6.36 లక్షల మందికి రేషన్ కార్డులు లేవు. అందుకే పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తున్నాం.

గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు చేసింది. దీనికి ప్రతి నెలా రూ.7వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం. జీతాలు, పింఛన్ల కోసం రూ.5వేల కోట్లు కేటాయిస్తున్నాం. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే వివిధ పథకాల కోసం రూ.29 వేల కోట్లు ఖర్చు చేశాం. ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపించాం. మొత్తం మూడు విడతల్లో రూ.31 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తాం." అని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు దశల్లో రుణాల మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రెండో విడత రుణమాఫీకి రూ.8వేల కోట్లు అవసరమని అంచనా. రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రైతు రుణాలను ఆగస్టు 15లోపు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడో విడత రుణమాఫీకి రూ. 15వేల కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఈ నెల 23 నుంచి శాసనసభ సమావేశాలు

## జులై 25 లేదా 26న బడ్జెట్ ప్రవేశం

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది కాంగ్రెస్ ప్రభుత్వం. పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం



నిర్ణయించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు అధికారులు.

# పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్ రైలు



(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు మృతిచెందగా.. దాదాపు 20 మందికి పైగా గాయపడినట్లు యూపీ ఉపముఖ్యమంత్రి బ్రజేశ్ పాథక్ తెలిపారు.

ఈ రైలు బుధవారం రాత్రి చండీగఢ్ స్టేషన్ నుంచి అస్సాంలోని డిబ్రూగఢ్‌కు బయల్దేరింది. గురువారం మధ్యాహ్నం యూపీలోని ఝులాహి రైల్వే స్టేషన్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలో ప్రమాదానికి గురైంది. నాలుగు ఏసీ బోగీలు సహా 12 బోగీలు పట్టాలు తప్పాయి. ఒక పక్కకు ఒరిగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

సమాచారమందుకున్న స్థానిక పోలీసులు, అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 15 అంబులెన్స్‌లు, మెడికల్ బృందాన్ని సిద్ధంగా ఉంచారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం గురించి తెలియగానే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంబంధిత యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అటు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ కూడా దీనిపై స్పందించారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలో ఇతర రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కనీసం 13 రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు. కొన్ని రైళ్లను రద్దు చేశారు.


# రీల్స్ చేస్తూ లోయలో పడ్డ రీల్ స్టార్

## చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన యువతి

ముందడుగు మహారాష్ట్ర:

సోషల్ మీడియా హవా పెరిగిపోతుండడంతో ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాలో రీల్స్ చేసే వారి సంఖ్య భారీగా పెరిగిపోయింది. అలాంటిది రీల్స్ చేయడంలో ముంబై యువతి అన్వి కామ్‌దార్ ఫేమస్‌గా మారింది. తాజాగా ఓ వీడియో తీసే క్రమంలో ఆమె ప్రాణాలు కోల్పోయింది. మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లాలో వీడియో తీసే సమయంలో ఆమె ఓ లోయలో పడిపోయింది. 27 ఏళ్ల ఆ అమ్మాయి.. రీల్ స్టార్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. వర్షా కాలం ఎంజాయ్ చేసేందుకు ఏడు మంది ఫ్రెండ్‌తో టూర్‌కు వెళ్లిన ఆ అమ్మాయి.. కుంబే వాటర్‌ఫాల్ వద్ద ఉన్న 300 ఫీట్ల లోతైన లోయలో పడిపోయింది. వీడియో తీసే క్రమంలో ఆమె పడిపోయినట్లు పోలీసులు చెప్పారు.

ముంబైలోని ములుండ్ ఏరియాలో అన్వి కామ్‌దార్ నివాసం ఉంటోందని మన్‌గావ్ పోలీసులు తెలిపారు.



జలపాతం వద్ద ఉన్న సీనరీని వీడియో తీస్తున్న సమయంలో ఆమె కాలుజారి లోయలో పడినట్లు పోలీసు అధికారి చెప్పారు. ఫ్రెండ్స్ అలర్ట్ చేయడంతో.. పోలీసులు, స్థానికులు అక్కడకు చేరుకున్నారు. ఆ తర్వాత మన్‌గావ్ తాలూకా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స సమయంలో ఆమె ప్రాణాలు విడిచింది. వృత్తిరీత్యా కామ్‌దార్.. చార్టర్డ్ అకౌంటెంట్‌గా చేస్తున్నారు. రీల్స్ ద్వారా ఆమె సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అయ్యారు.



## డిజిపి గారు..

# పోలీసులది ఇదేం భాష

(మొదటిపేజీ తరువాయి)

ఆలయం సమీపంలో ట్రాఫిక్ పోలీసులు ఓ వాహనదారుడిపై చేయిచేసుకుని, దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ.. ఇది పోలీస్ శాఖకు, డీజీపీకి అంగీకారయోగ్యమైన భాషనా అని ప్రశ్నించారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులకు ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారని గుర్తుంచుకోవాలని సూచించారు.

ఈ మధ్యకాలంలో ప్రజలతో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు అనేకసార్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పదుల సంఖ్యలో సోషల్ మీడియాలో వీడియోలు వస్తున్నా పోలీసులు స్పందించడం లేదని చెప్పారు. ప్రజలతో వ్యవహరించే విషయంలో పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

# నాకు పదవులు, రాజీనామాలు కొత్తేం కాదు

బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు

ముందడుగు తెలంగాణ:

నాకు పదవులు, రాజీనామాలు కొత్తేం కాదని, ఆగస్టు 15 వరకు రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు సంపూర్ణంగా అమలు చేసి చూపించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ, హామీలు అమలు చేస్తే తాను రాజీనామాకు సిద్ధమని, చేయని పక్షంలో మీరు రాజీనామా చేసేందుకు సిద్ధమా?అంటూ ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. "తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి, ఎమ్మెల్యే పదవులను తృణప్రాయంగా భావించి రాజీనామా చేసిన చరిత్ర నాది. ప్రజలకు నా వల్ల మంచి జరుగుతుందటే.. నేను ఎన్నిసార్లు పదవులకు రాజీనామా చేయడానికైనా వెనుకాడను"అని పేర్కొన్నారు.



ముందడుగు
శుక్రవారం,
19-7-2024,
హైదరాబాద్



## ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ తల్లి అరెస్ట్

రైతుల్ని గన్‌తో బెదిరించారని ఆరోపణ

మనోరమ ఖేద్కర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

ముందడుగు మహారాష్ట్ర:

ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐఏఎస్ ఆఫీసర్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమా ఖేద్కర్‌ను అక్రమ రీతిలో గన్ కలిగి ఉన్న కేసులో ఆమెను పుణె పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాయిగడ్ జిల్లాలోని రాయ్‌గడ్ ఫోర్ట్ వద్ద ఓ లాడ్జ్‌లో మనోరమ దాక్కుకున్నారు. గురువారం ఉదయం పుణె పోలీసులు ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. పుణె జిల్లాలోని ముల్సి గ్రామంలో ఓ భూ వివాదం విషయంలో రైతుల్ని గన్‌తో బెదిరిస్తున్న మనోరమ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. వీడియో వైరల్ అయిన తర్వాత మనోరమపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌లో ఆమె భర్త దిలీప్ ఖేద్కర్ పేరును కూడా జోడించారు. దిలీప్ ఖేద్కర్‌పై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో ఆయన రెండు సార్లు సస్పెన్షన్‌కు గురయ్యారు.

## రైతును అవమానించిన మాల్‌పై చర్యలు

ఏడు రోజులు మూసివేయాలని ప్రభుత్వం ఆదేశం



ముందడుగు కర్ణాటక:

ఒక రైతు పంచెకట్టుతో బెంగళూరులోని ఓ మాల్‌లోకి వెళుతుండగా మాల్ నిర్వాహకులు రానివ్వకుండా అడ్డుకున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఏడురోజుల పాటు మాల్‌ను మూసివేయాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రవర్తన వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడం కిందికే వస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం మాగడి రోడ్డు జీటీ మాల్‌లోని మల్టీప్లెక్స్‌లో కుమారుడితో కలిసి సినిమా చూసేందుకు వచ్చిన హావేరికి చెందిన ఫకీరప్ప అనే రైతును అక్కడి కాపలాదారు గోపాల్ అడ్డుకున్నాడు. పంచె కట్టుకుని వచ్చిన ఆయన్ను లోపలికి అనుమతించలేదు. ఫకీరప్ప కుమారుడు దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ ఘటనపై రైతు సంఘాల నాయకులు తీవ్రంగా స్పందించారు. మాల్ యాజమాన్యం క్షమాపణలు చెప్పకపోతే, పంచెకట్టుతో వేల మంది రైతులు వచ్చి మాల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దాంతో దిగొచ్చిన మాల్ యాజమాన్యం.. రైతుకు శాలువా కప్పి సత్కరించింది. అందరి ముందు క్షమాపణలు కోరింది. ఇకపై ఇటువంటి పొరపాటు చేయబోమని ప్రకటించింది.

## చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం నేరం కాదు

- వాటిని ప్రసారం చేయడం, షేర్ చేయడం నేరం
- కేసును కొట్టివేసిన కర్ణాటక హైకోర్టు




ముందడుగు కర్ణాటక:

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనల ప్రకారం "చైల్డ్ పోర్నోగ్రఫీ"ని చూడటం నేరం కాదని, ఇది నేరాన్ని ఆకర్షించదని కర్ణాటక హైకోర్టు తీర్పు చెప్పింది. పిల్లల అశ్లీల వెబ్‌సైట్‌ని 50 నిమిషాలు చూశాడనే ఆరోపణలతో ఒక వ్యక్తిపై నమోదైన కేసును కర్ణాటక హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్‌పై అశ్లీల వెబ్‌సైట్ చూశాడని ఆరోపణలు వచ్చాయి. "కోర్టు దృష్టిలో IT చట్టంలోని సెక్షన్ 67B ప్రకారం వాటిని ప్రసారం చేయడం, షేర్ చేయడం నేరం. దీనికి మించి పిటిషన్‌కి వ్యతిరేకంగా ఎలాంటి ఆరోపణలు లేవు. 2008లోని సెక్షన్ 67B ప్రకారం వాటిని వీక్షించడం నేరం కాదు" అని జస్టిస్ నాగప్రసన్నతో కూడిన సింగిల్ బెంచ్ తీర్పును ఇచ్చింది. ఈ కేసు నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ఉపశమనం కలిగించింది.

## మొహర్రం రోజున చారిత్రక అలీ లాడ్జిని సందర్శించిన నవాబ్ రౌనక్ యార్ ఖాన్



ముందడుగు హైదరాబాద్:

సాలార్ జంగ్ మ్యూజియం ప్రక్కనే ఉన్న సయ్యద్ అబిద్ అలీ నివాసం లోని చారిత్రక 'అలీ లాడ్జ్' ను 10 వ మొహరం సందర్భంగా ఆసిఫ్ జాహీ రాజవంశ 9వ నిజాం నవాబ్ రౌనక్ యార్ ఖాన్ సందర్శించారు, ఈ కార్యక్రమానికి జనాబ్ సయ్యద్ సికందర్ మార్గనిర్దేశం చేశారు. ఈ వేడుకకు ప్రత్యేక అతిథిగా వచ్చినందుకు నవాబ్ రౌనక్ యార్ ఖాన్ తన ప్రగాఢమైన ప్రశంసలు మరియు గౌరవాన్ని తెలియజేసారు మరియు రాజ సంఘానికి తన మద్దతు కొనసాగుతుందని ప్రతిజ్ఞ చేశారు. ప్రతిస్పందనగా, నవాబ్ అబిద్ అలీ రెండు కుటుంబాల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తూ, నవాబ్ నుండి భవిష్యత్ సందర్శనలను స్వాగతించారు. "ఈ పవిత్రమైన రోజున నవాబ్ రౌనక్ యార్ ఖాన్ 'అలీ లాడ్జ్'ని సందర్శించడం మా కుటుంబానికి మరియు సమాజానికి గొప్ప ప్రాముఖ్యతను కలిగి ఉంది" అని సయ్యద్ సికందర్ అన్నారు. "నిజామ్‌కు ఆతిథ్యం ఇచ్చినందుకు మేము గౌరవించబడ్డాము మరియు నిరంతర సహకారం మరియు మద్దతు కోసం ఎదురుచూస్తున్నారు అన్నారు"

## రాజకీయవేత్త చేసేది రాజకీయం..

శంకరాచార్యకు కౌంటర్ ఇచ్చిన కంగనా రనౌత్

ముందడుగు జాతీయం:

మహారాష్ట్ర ప్రస్తుత సీఎం షిండే, మాజీ సీఎం ఉద్దేవ్ ఠాక్రాను మోసం చేసి, వెన్నుపోటు పొడిచారని, హిందూ మతంలో మోసాన్నిపెద్ద పాపంగా పరిగణిస్తారని, మోసం చేసేవాడు హిందువు కాదు అని ఇటీవల జ్యోతిర్మఠ పీఠాధిపతి శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను ఎంపీ కంగనా రనౌత్ తప్పుపట్టారు. శివసేన నేత, సీఎం ఏకనాథ్ షిండేకు ఆమె మద్దతుగా నిలిచారు.



అవిముక్తేశ్వరానంద స్వామికి కౌంటర్ ఇచ్చిన ఎంపీ కంగనా.. రాజకీయాల్లో రాజకీయవేత్త రాజకీయం చేయకుంటే .. పానీ పురీ అమ్ముకుంటాడా అని ఆమె ప్రశ్నించారు. రాజకీయాల్లో కూటమిలు ఏర్పాటు చేయడం, పార్టీలో విభేదాలు రావడం ఇవన్నీ కామన్ అన్నారు. 1907, 1971లో కాంగ్రెస్ పార్టీలో చీలకలు వచ్చినట్లు ఆమె తెలిపారు. శంకరాచార్య తన మాటలను తప్పుగా వాడారని, ఒకవేళ రాజు దోచుకోవడం ప్రారంభిస్తే, అప్పుడు అది దేశద్రోహం అవుతుందని మతం పేర్కొన్నట్లు ఆమె వెల్లడించారు. ఏక్‌నాథ్ షిండేను ద్రోహి అంటూ మనందరి మనోభావాలను శంకరాచార్య దెబ్బతీశారని కంగనా తెలిపారు. అనుచిత అంశాలను వెల్లడిస్తూ హిందూ మత గౌరవాన్ని శంకరాచార్య కించపరుస్తున్నారని ఆమె అన్నారు. 2022 జూన్‌లో శివసేన(యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి ప్రభుత్వాన్ని కూల్చి.. బీజేపీ సపోర్టుతో ఏకనాథ్ షిండే సీఎం అయ్యారు.

ముందడుగు
శుక్రవారం, 19-7-2024, హైదరాబాద్

## రైతులను కూడా వదలని
# సైబర్ కేటుగాళ్లు
### రుణమాఫీ డబ్బులపై అప్రమత్తంగా ఉండాలని సూచన




ముందడుగు తెలంగాణ:
సైబర్ కేటుగాళ్లు అవకాశం దొరికిన ప్రతి ఒక్కరిని బురిడీ కొట్టించి దోచుకుంటున్నారు. చివరకి రైతులను కూడా వదలడం లేదు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఏదో బ్యాంకు పేరిట మోసానికి పాల్పడుతున్నారు. ఏదో ఒక బ్యాంకు పిక్చర్ ను వాట్సాప్ ప్రొఫైల్ ఫిక్ గా పెట్టి ఏపీకే ఫైల్స్ పంపుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచిస్తోంది. సైబర్ నేరగాళ్లు పంపించే లింకు యాక్సెప్ట్ చేస్తే..ఫోన్ వాళ్ళ కంట్రోల్లోకి వెళ్లే అవకాశం ఉందని తెలిపింది. ఫోన్ పే గూగుల్ పే యూ పే వాడకంలో జాగ్రత్తలు పాటించాలని వెల్లడించింది. అలాంటి లింక్ వస్తే ఓపెన్ చేయొద్దని చెప్పింది. ఎవరైనా అలా డబ్బులు పోగొట్టుకుంటే 1930 ఫోన్ చేయాలని సూచించింది.

నేడు తెలంగాణ సర్కారు రూ.లక్షలోపు రైతు రుణాలు మాఫీ చేయనుంది. సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమవుతాయి. 11.50 లక్షల మంది రైతుల రుణమాఫి సాయాన్ని పొందుతారు. ఇప్పటికే బ్యాంకులకు ఆర్థిక శాఖ నిధులు జమ చేసింది. ఆగస్టు పూర్తయ్యేలోపు 3 దశల్లో రైతుల రుణమాఫీ ప్రక్రియ జరగనుంది. ఈ నెలఖారులోపు రూ.1.50 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ కానున్నాయి. ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల వరకు ఉన్న రైతుల రుణాలు మాఫీ కానున్నాయి. కుటుంబాన్ని నిర్ధారించేందుకే ప్రామాణికంగా రేషన్ కార్డును చూడనున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ మేరకు సూచనలు చేసింది.

# ఫోన్ పే, గూగుల్ పే వారికి గుడ్ న్యూస్
### పేమెంట్స్ వేరొకరికి వెళ్లినా నో ప్రాబ్లం ▪ టోల్ ఫ్రీ నెంబర్ తెచ్చిన ఆర్బీఐ

ముందడుగు జాతీయం:
మన దేశంలో డిజిటల్ పేమెంట్స్ మామూలైపోయాయి. నేడు ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి రావడం, బ్యాంకు ఖాతా ఉన్న మెజారిటీ ప్రజలు స్మార్ట్ ఫోన్ వాడుతుండటంతో యూపీఐ పేమెంట్స్ భారీగా పెరిగాయి. యూపీఐ పేమెంట్స్ చేసే సందర్భాల్లో యూజర్లు కొన్నిసార్లు డబ్బును పొరపాటున ఒకరికి పంపబోయి మరొకరికి పంపుతుంటారు. ఆ తర్వాత ఆ డబ్బును తిరిగి తెచ్చుకోవడానికి నానా తంటాలు పడుతుంటారు. ఇకపై.. ఆ తిప్పలు కాస్తంత తగ్గించుకునే అవకాశం ఉంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' ఒక టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పొరపాటున డబ్బును ఒకరికి పంపబోయి మరొకరికి పంపి ఉంటే వెంటనే18001201740 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి వారికి ఎదురైన సమస్యను తెలియజేయాలి. ఈ ఫిర్యాదు అందుకున్న 48 గంటల్లో సమస్య పరిష్కారం అవుతుంది. ఆ డబ్బు ఏ ఖాతా నుంచి డెబిట్ అయిందో అదే ఖాతాకు తిరిగి క్రెడిట్ అవుతుంది. ఈ టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి రిపోర్ట్ చేయొచ్చు లేదనుకుంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. కానీ బ్యాంకులో అయితే ఒక ఫామ్ నింపాల్సి ఉంటుంది. తిరిగి డబ్బు ఖాతాలోకి రావడానికి కాస్తంత ఎక్కువ సమయం పడుతుంది. బ్యాంకు సిబ్బంది కూడా ఈ డిజిటల్ పేమెంట్స్ సంబంధిత సమస్యలపై త్వరితగతిన స్పందించకపోవచ్చు. రోజువారీ పనుల్లో తలమునకలై పెద్దగా పట్టించుకోకపోవచ్చు. అందువల్ల.. ఈ టోల్ ఫ్రీ నంబర్ ఎక్కువ మందికి ఉపయోగపడే అవకాశం ఉంది. యూపీఐ మోడ్‌లో పేమెంట్స్ చేసిన వారికి మాత్రమే ఈ వెసులుబాటు ఉంది. టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి విషయం ఇది అని చెప్తే 48 గంటల్లోగా రిఫండ్ పొందే సదుపాయం అందుబాటులోకి రావడం హర్షనీయం.

## ఇబ్బందులు తలెత్తకుండా
# రైతు ఋణ మాఫీ ప్రక్రియ
### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ముందడుగు ములుగు:
రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు ఋణ మాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు రుణమాఫీ ప్రక్రియపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు,పిఏస్ సీఎస్ సొసైటీ ఛైర్మన్లు, సి ఈ ఓలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12,906 మంది రైతులకు రైతు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో భాగంగా ఒక లక్ష రూపాయలు లోపు బకాయిలు ఉన్న రైతుల ఖాతాలలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. రెండవ విడత ఈ నెల 31 నుండి ప్రారంభం అవుతుందని అన్నారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, లీడ్ బ్యాంక్ అధికారి డి సి ఓ సర్దార్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు,పిఎస్ సీఎస్ సొసైటీ ఛైర్మెన్లు, సిఈఓలు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

## సైనికుల త్యాగాలు, జ్ఞాపకాలు
# సాహిత్యంలో భాగం కావాలి
### సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

ముందడుగు జాతీయం:
దేశ రక్షణతో పాటు ప్రజల భద్రత కోసం అనునిత్యం పనిచేసి ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాలు, జ్ఞాపకాలు జానపద సాహిత్యంలో భాగం కావాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధం 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. గతంలో చేసిన తప్పిదాలను పునరావృతం చేయకూడదన్నారు. కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికులను సీడీఎస్ ఈ సందర్భంగా కొనియాడారు.

"యుద్ధం, యుద్ధక్షేత్రం వేగంగా మారుతున్నాయి. సాంకేతికతలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు, భౌగోళిక రాజకీయ పరిణామాలతో యుద్ధం స్వభావం కూడా మారుతోంది. కార్గిల్ యుద్ధంతో ఇది నిజంగానే మారింది. సైనికులు చేసిన త్యాగాల జ్ఞాపకాలు మన జానపద సాహిత్యంలో భాగం కావాలి. గతంలో నేర్చుకున్న పాఠాలు మన సైన్యంలో ఇమిడిపోవాలి" అని త్రివిధ



దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. సాయుధ దళాల్లో చేరే యువతలో స్ఫూర్తి నింపడంతోపాటు శౌర్యం, పరాక్రమం వారిలో కొనసాగించేలా కృషి చేయాలన్నారు. యుద్ధం జ్ఞాపకాలను గుర్తుపెట్టుకోవడంతో పాటు దాని పరిణామాలను విశ్లేషించి, భవిష్యత్తు కోసం సరైన పాఠాలు నేర్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.

ముందడుగు
శుక్రవారం, 19-7-2024, హైదరాబాద్



# అవమానాల నుంచి యునెస్కో గుర్తింపు

- ఆమె ప్రతిభకు అపూర్వ గౌరవం..
- మహిళా నృత్య కళాకారిణికి ఐరాస ప్రశంస

ముందడుగు ప్రత్యేకం: దేశంలోని కొన్ని ప్రాంతాలు అరుదైన కళలకు, సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉంటుంది. అలాంటిది పశ్చిమ బెంగాల్‌లోని చౌనృత్యం ఈ జిల్లా సంప్రదాయాలలో ప్రధానమైనది. పురూలియా నటి మౌషుమి చౌదరి దీనిని ప్రపంచ ఖ్యాతికి తీసుకు వెళ్లారు. రకరకాల మాటలకు, అవమానాలకు ఆమె భయపడలేదు. సమాజం ముందు ధైర్యంగా నిలబడి.. తన ప్రతిభను చూపింది. దీంతో అందరూ ఆ అద్భుత ప్రతిభకు దాసోహం అయ్యారు.. నేడు దేశ విదేశాల్లో ఆమె డ్యాన్స్ కు ఎంతో మంది అభిమానులు ఉన్నారు.

### ఐక్యరాజ్యసమితి గుర్తింపు

మౌసుమీ జీవిత కథను ఐక్యరాజ్యసమితి మహిళా సంస్థ గుర్తించింది. ఇటీవల ఢిల్లీలోని యూఎస్ హౌస్‌లో.. హమ్: వెన్ ఉమెన్ లీడ్' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఆ పుస్తకంలో మౌషుమి ఛౌ జీవిత ప్రయాణం కథ ఉంది. ఈ సందర్భంగా మౌషుమీ చౌదరి మాట్లాడుతూ తన ప్రతిభను అందరి ముందు చూపాలని ఎప్పుడూ కోరుకుంటుందన్నారు. ఒక మహిళగా, చౌ సామ్రాజ్యంలో తాను సాధించిన స్థానం పట్ల ఆమె చాలా సంతోషం వ్యక్తం చేశారు. పల్లెటూరి అమ్మాయి అయినప్పటికీ యునెస్కో లాంటి సంస్థ తనను గుర్తించడం చాలా గర్వంగా ఉందని తెలిపారు.

### తండ్రినే మొదటి గురువు

మౌషుమి విషయానికి వస్తే.. కుమారి నది పక్కన పురూలియా వద్ద ఆమె పెరుగుతుంది. 2007-08 నుండి ఆమె చౌ నృత్యంలో శిక్షణ తీసుకుంటోంది. మౌషుమి మొదటి గురువు ఆమె తండ్రి. ఇక మాల్దీలోని చౌ క్యాంప్ రాష్ట్ర-కేంద్రం చొరవతో స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో 2012లో స్థాపించబడింది. అప్పటి నుండి మౌషుమీ నాలుగు గోడల కంచెని బద్దలు కొట్టి మహిళా ఛౌ టీమ్‌ని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఆమెపై విమర్శల దాడులు మొదలయ్యాయి. ముఖ్యంగా ఇరుగుపొరుగు వారు వ్యంగ్యంగా మౌషుమిని విమర్శించారు. ప్రతి విషయంలోనూ దూషించడం మొదలు పెట్టారు. అయితే ఇవేవీ ఆమెను అడ్డుకోలేకపోయాయి. తను నమ్మిన మార్గంలో మౌషుమి ముందుకు సాగింది. దేశ విదేశాల్లో ఆమె గుర్తింపు సాధించింది. దీంతో ఐక్యరాజ్యసమితి ఆమెను గుర్తించి సత్కరించారు.

# పదవ తరగతి టాపర్ విద్యార్థులకు ఆర్థిక సహాయం




ముందడుగు ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం రాపోల్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం గోర్తి ఈశ్వర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో టాపర్ గా నిలిచిన విద్యార్థిని పట్నం భావన ట్రస్ట్ వ్యవస్థాపక ఫౌండర్ ఉషాబాలా, పవన్ కుమార్ లు 25000 వేల మనీ బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ హై స్కూల్ పాఠశాలలో గత పది సంవత్సరాలుగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్రం నుండి మనీ బహుమతి ప్రధానోత్సవం చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ట్రస్టు చైర్మన్ ఆదేశాల మేరకు మనీ బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు శ్రీనాథ్ రెడ్డి, పి తిరుపతిరెడ్డి, నజర్, గారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# యువతను ఆకట్టుకునే చిత్రం అంతులేని నా ప్రేమకథ



ముందడుగు హైదరాబాద్: యువతకి నచ్చే విధంగా ఎంతో అందంగా తీర్చిదిద్దిన పిక్సల్ ఆర్ట్స్ సమర్పించు లవ్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్ "అంతులేని నా ప్రేమకథ " ఈ షార్ట్ ఫిల్మ్ ని శివ నాగరాజ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాలు హీరో హీరోయిన్స్, అనుదీప్, శ్వేత నటిస్తున్నారు. ఈ షార్ట్ ఫిల్మ్ ట్రైలర్ ని ఫోకస్ మూవీ హీరో "విజయ్ శంకర్ " మరియు క్రేజీ బాయ్స్ సాయి కిరణ్ ప్రారంభించారు. విజయ్ శంకర్ మాట్లాడుతూ ఈ అంతులేని నా ప్రేమకథ ట్రైలర్ చూస్తుంటే ఒక పెద్ద సినిమా చూసి నట్టు ఉంది.. డైలాగ్స్ స్క్రీన్ ప్లే అయ్యితే ఒక సినిమా స్థాయిలో ఉన్నాయి అని చెప్పారు. నటీనటులు వెంకీ సూరి, సాయి సతీష్ చౌదరి నటించగా, ఎడిటర్ కేతన్ కుమార్, కలరిస్ట్ రామోజు మణికంఠ చారీ, మ్యూజిక్ జాన్ పొట్ల, కెమెరా నవీన్ కుమార్ పొన్నాల, డిజిటల్ త్రినాధ్ రెడ్డి గంగినేని, జాఫర్ వలి, కృష్ణ వంశీ పని చేసారు.